# ఓడిపోయాను!



ఉదయం లేచి, కేలండరు చూసినప్పటి నుండి 'ఈ రోజు శ్రీమతిని ఎలా నమ్మించాలి' అన్న ఆలోచన నా మెదడును తినేస్తోంది.

ఇప్పటికి పెండ్లి అయి ఐదు సంవత్సరములైంది. నాటి నుండి నేటి వరకు ఎన్నో ప్రయత్నాలు చేస్తూనే వున్నాను. కాని విజయం సాధించలేకపోయాను. నా జాతకం ప్రకారం ఈ సంవత్సరాంతంలో విజయం సాధించే సూచనలున్నాయట! కాలం కలిసి వస్తే ఈ సంఘటనను పది కాలాలపాటు పదిలపర్చుకోవచ్చు. "ధైర్యే సాహసే లక్ష్మీ" అన్నారు పెద్దలు. వారి అడుగు జాడల్లో నడవటానికి నిర్ణయించుకున్నాను.

* * *

కొందరు భర్త ఏదయినా చెబితే వేదాక్షరాలు అను కుని బుట్టలో పడిపోతారు. కాని నా శ్రీమతి శారద అలా కాదే! ఆడవాళ్ళకు చీరలు, నగలు పిచ్చి అంటారు. అలాంటి విషయాల్లో నమ్మించటానికి చాలా అవ కాశాలు చిక్కుతాయి. అదేమి శాపమో! శారదకు వాటి మీద శ్రద్ధ, కోరికల్లేవు.

క్రిందటి సంవత్సరం ఇలాగే పువ్వుల పొట్లం తెచ్చి, "ఇవిగో మల్లెలు" అన్నాను కన్నుగీటుతూ! "అబ్బ అక్కడ పెదుదురూ. ఇప్పుడు పని వుంది" అంది విసుగ్గా. ఆ రోజు ఎన్నిసార్లో గుర్తు చేసాను శ్రీమతి పొట్లం విప్పి తెల్లబోవాలని! పగలల్లా పని, పని అని సాయంత్రానికి "నేను ఇంట్లోకి రాకూడదండీ" అంది ముసిముసిగా నవ్వుతూ. నాకు వళ్ళు మండిపోయింది. పొట్లంలో గులాబీలు నన్ను వెక్కిరించాయి. నీటికి మాటికి నన్ను నమ్మించి వెక్కిరిస్తూనే వుంది.

* * *

ఈ రోజు మాత్రం నేను పట్టుబడిపోకుండా జాగ్రత్తగా ప్రవర్తించాలి. ఒక్కొక్కరికి ఒక వీక్‌నెస్ వుంటుంది. దాన్ని ఆధారం చేసుకుని, సమయం చూసి దెబ్బతీయాలి.

శ్రీమతికి సినిమాలంటే పిచ్చి. "స్రవంతి సిని మాలో జయసుధ అచ్చం నీలాగే వుంది. ఈ రోజు వెడదాం!" అన్నాను గారంగా.

"సారీ సార్! నన్ను బోల్తా కొట్టిద్దామనుకున్నారు కదూ! ఏ సినిమా ఏ హాలులో ఆడుతోందో, అందులో హీరో, హీరోయిన్లు ఎవరో నాకు కంఠోపాఠమే!" అని చప్పట్లు కొట్టి, కిల, కిలా నవ్వింది. నా మతిమరుపు నకు తిట్టుకొని, పైకి నవ్వు తెచ్చుకుని, "అమ్మదొంగా పట్టేశావు!" అన్నాను.

ఆలోచించగా, ఆలోచించగా ఒక ఐడియా తట్టింది. ఈమధ్య శారద విసుగు చెందని విక్రమార్కుడిలా చేసే ప్రయత్నం మీద దెబ్బ తియ్యాలి అనుకున్నాను. దీనికి తిరుగు లేదు. శ్రీమతి బుట్టలో పడి తీరవలసిందే అన్న గట్టి నమ్మకం కుదిరింది. వెంటనే బయలుదేరి బజారు చేరుకున్నాను. పని ముగించుకుని శ్రీమతితో చెప్ప వలసిన విషయాన్ని మననం చేసుకుంటూ ఇంటికి చేరుకున్నాను.

శారద చిరునవ్వుతో ఎదురు వచ్చింది. ధైర్యం చేసి, "శారూ! నీకు శుభవార్త. నీవు రచయిత్రివయ్యావు. ఇదిగో చూడు నువ్వు వ్రాసిన కథ ఇందులో పడింది" అన్నాను వారపత్రికను చూపించి ఊరిస్తూ.

అంతే ఒక్క గెంతు గెంతి నా మీద పడి పుస్తకాన్ని లాక్కుని తిరగవేస్తోంది.

"బోల్తా కొట్టావులే బుల్‌బుల్ పిట్ట" అను కున్నాను విజయగర్వంతో.

కెవ్వున కేకవేసి, నన్ను కౌగలించేసుకుంది. విషయం అర్థం కాక పుస్తకం తెరిచాను. అంతే తేలుకుట్టిన దొంగలా వుంది నా పరిస్థితి. చేసేది లేక ముఖం నిండా నవ్వు పులుముకుని "కంగ్రాట్యులేషన్స్!" అన్నాను.

"నువ్వే ఏప్రియల్ ఫూల్‌వి" అని వేయి గొంతు లతో ఒక్కసారి పలికినట్లుగా అంతరాత్మ ఘోషిం చింది.

—జయంతి కాశీఅన్నపూర్ణ

## సుభాషితాలు...

కుళ్ళిపోతున్న కురుపుమీద వైద్యుడు జరిపే శస్త్ర ప్రయోగాన్ని హింస అని ఎవ్వడూ అనలేదు.

—శ్రీశ్రీ

***

ఉదయం కానే కాదనుకోవడం నిరాశ. ఉదయించి అట్లానే వుండాలనుకోవడం దురాశ.

—కాళోజి

***

శిష్టాచారమైనను నీతికి బాహ్యమైనచో అది మాన్యము కానేరదు.

—తిరుపతి వేంకట కవులు

***

ఇతరుల దోషాలను చూసినట్టు తమ దోషాలను చూడగలిగితే ఈ ప్రపంచం నుండి దుర్మార్గం తొలగి పోవడం తథ్యం.

—తిరుక్కురల్

***

ముసలితనం రూపాన్ని, ఆశ ధైర్యాన్ని, మృత్యువు ప్రాణాన్ని, అసూయ ధర్మాచరణాన్ని, క్రోధం సంపదను హరిస్తుంది.

—విదుర నీతి

సేకరణ: కె.కిరణ్‌కుమార్

******

ఏ విషయమైనా క్రొత్తగా వున్నప్పుడే బావుంటుంది. స్నేహం మాత్రం పాతబడేకొలదీ బావుంటుంది.

—చింగ్ చా

***

క్రొత్తగా అందిన సుఖాలు క్రొత్త బాధలు కలిగిస్తాయి.

—బల్వర్

***

నీ మీద నీకున్న నమ్మకమే నిన్ను సమర్థుణ్ణి చేస్తుంది.

—వర్మిల్

***

నేటి సమాజంలో రెండు రకాల నీతులున్నాయి. ఒకటి బోధిస్తాం, కాని ఆచరించం. రెండు ఆచరిస్తాం, కాని పైకి చెప్పం.

—రస్సెల్

***

ప్రతి వాడూ ఎదుటి వాడి తప్పుల్ని మహా తీవ్రంగా పరిశీలిస్తూంటాడు.

—డయిడన్

***

దుబారా మనిషికి దారిద్ర్యం తప్పదు. ఆ దారిద్ర్యం మనిషి వ్యక్తిత్వాన్ని హరించి నేరస్తుణ్ణిగా తయారు చేస్తుంది.

—జాన్సన్

***

చేసేవాడు, చేయించువాడు, ప్రేరేపించువాడు, ఆమోదించువాడు ఈ నలుగురూ పాప పుణ్యాలకు భాగస్వాములే

- పంచతంత్రం.

సేకరణ: మొగలి రమాదేవి, కాకినాడ.